www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 23 మే 2023
5
ఏలూరు

సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి

పెదవేగి: సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని అమ్మ పాలెంలో సేంద్రియ పద్ధతుల్లో సాగుచేస్తున్న నిమ్మ, కొబ్బరి, జామ తదితర పంటలను ఎపి రైతుసంఘం నాయకులు పరిశీలించారు. నిమ్మకాయలకు కనీస ధర రాక ప్రతిఏటా నష్టపోతున్నామంటూ నిమ్మ రైతులు రైతు సంఘం నాయకుల వద్ద వాపోయారు. రైతు కొఠారు చంద్రరావు నిమ్మతోట పరిశీలించగా సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేస్తున్న నిమ్మకాయలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర రావడం లేదని రైతు చెప్పారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సేంద్రీయ పంటలు సాగు చేయాలని ప్రభుత్వం ఒకవైపు చెబుతుంటే ఆయా ఉత్పత్తులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర రాక రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కిలో నిమ్మకాయలకు మార్కెట్‌లో కేవలం రూ.15 మాత్రమే ధర వస్తోందని చెప్పారు. కూలి, రవాణా ఖర్చులు కూడా రైతుకు రావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో చందు సత్తిబాబు, కొఠారు చంద్రరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రమాదంలో 'తీరం'..!

'ఇన్‌కోయిస్' అధ్యయనంలో వెల్లడి
జిల్లాలోనూ అత్యధికంగా సముద్రతీరం కోతకు గురికానున్నట్లు నిర్ధారణ
10 శాతం బహుళ ప్రమాదాలు కలిగిన జోన్‌గా గుర్తింపు
ఆందోళనలో తీర ప్రాంత గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలోని సముద్ర తీర ప్రాంతానికి ప్రమాదం పొంచి ఉందని, తీర ప్రాంతంలో నివశిస్తున్న ప్రజానీకం ముంపు సమస్యను ఎదుర్కోనున్నట్లు నేషనల్ ఇంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఇన్‌కోయిస్) అధ్యయనంలో వెల్లడైంది. ఇన్‌కోయిస్ డైరెక్టర్ టి.శ్రీనివాస్‌కుమార్ నేతృత్వంలోని సీనియర్ శాస్త్రవేత్తలు టిఎం.బాలకృష్ణన్‌నాయర్, సుధీర్‌జోసెఫ్, పిఎ.ఫ్రాన్సిస్, పిసి మొహంతి, ఆర్‌ఎస్ మహేంద్ర ఈ అధ్యయనం నిర్వహించారు. శాస్త్రవేత్తల అధ్యయనంలో అనేక దిగ్భ్రాంతి గొలిపే విషయాలు వెల్లడయ్యాయి. సముద్ర తీరం పెద్దఎత్తున కోతకు గురికానున్న ప్రాంతాల్లో జిల్లాలోని తీర ప్రాంతం సైతం ఉంది. జిల్లాలోని తీర ప్రాంతం పది శాతం బహుళ ప్రమాదాలు కలిగిన తీర ప్రాంతజోన్ (సిఎంజెడ్)గా శాస్త్రవేత్తలు గుర్తించారు. దీంతో ముంపునకు గురయ్యే తీర ప్రాంతం జిల్లాలోనూ అత్యధికంగా ఉన్నట్లు తేలింది. రాష్ట్రంలో 706 గ్రామాలు, ఎనిమిది పట్టణాల్లో దాదాపు 90 శాతం ప్రాంతం బహుళ ప్రమాదకర జోన్ పరిధిలోకి వస్తాయని వెల్లడించిన అధ్యయనంలో పశ్చిమగోదావరి జిల్లాలోని తీర ప్రాంతం గురించి శాస్త్రవేత్తలు స్పష్టంగా పేర్కొన్నారు. విభజిత పశ్చిమగోదావరి జిల్లాలో 19 కిలోమీటర్ల మేర సముద్ర తీర ప్రాంతం విస్తరించి ఉంది. మొగల్తూరు, నరసాపురం మండలాల్లోని పేరుపాలెం సౌత్, కెపిపాలెం సౌత్, తూర్పుతాళ్లు, పెదమైనివాని లంక, చినమైనివాని లంక, బియ్యపుతిప్ప గ్రామాలు తీరప్రాంతాన్ని ఆనుకుని ఉన్నాయి. దాదాపు 20 వేల మంది జనాభా వరకూ తీరప్రాంత పరిధిలో నివశిస్తున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. వీరిలో పది వేల మందికిపైగా మత్స్యకారులు ఉన్నారు. ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారం నాలుగువేల మందికి పైగా సముద్రంలో చేపల వేటతో ఉపాధి పొందుతున్నారు. గతంకంటే తీరప్రాంతంలో కోత పెరుగుతున్న పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు. పలు గ్రామాల్లో తీరం పెద్దఎత్తున కోతకు గురవడంతో కొబ్బరిచెట్లు సైతం నేలకొరిగిన పరిస్థితి ఉంది.

ఆందోళనలో తీర ప్రాంత ప్రజలు

తీర ప్రాంతంలో ముంపు ముప్పుపై వెల్లడవుతున్న అధ్యయనాలతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే తుపాన్లు సంభవించినప్పుడు తీర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలల ఉధృతి భయాందోళనలు కల్గిస్తున్నాయి. తీరంలో అలలు ముందుకొస్తుండటంతో కోత పెరుగుతోంది. దీంతో తుపాన్ల సమయంలో స్థానిక ప్రజానీకాన్ని పునరావాస కేంద్రాలకు తరలించాల్సిన పరిస్థితి ఉంది. 50 ఏళ్ల ముందు కంటే తీర ప్రాంతం కోతకు గురై బాగా ముందుకు చొచ్చుకొచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. తీరం కోత పెరిగే కొద్దీ స్థానిక ప్రజానీకానికి సంబంధించిన భూములు, ఇళ్లు సైతం ప్రమాదంలో పడే పరిస్థితి రానుంది. అదే జరిగితే తీర ప్రాంత ప్రజలు ఆర్థికంగా తీవ్రంగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడనుంది. పంట భూములను కోల్పోనున్నారు. గత శతాబ్దకాలంలో అలల తాకిడి స్థాయిలను పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత అధ్యయనం జరిగింది. దీనిప్రకారం తీరం ప్రమాదంలో ఉందని స్పష్టమవుతోంది.

నదులపై అధిక రిజర్వాయర్ల నిర్మాణంతోనే తీరం కోత

డాక్టర్ పి.ఎ.రామకృష్ణంరాజు, ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్, పర్యావరణ వేత్త

కృష్ణ, కావేరితోపాటు పలు నదులపై పెద్దసంఖ్యలో రిజర్వాయర్లు నిర్మించేశారు. నదుల్లో నీరు సముద్రంలోకి రావడం లేదు. నదుల్లో నీరు సముద్రంలోకి ప్రవేశించినప్పుడు పెద్దఎత్తున మట్టి చేరుకుంటుంది. దీంతో సముద్రం తీరంలో మట్టి చేరి లోపలికి పూడుకుంటుంది. పదివేల ఏళ్ల క్రితం నుంచి కొట్టుకొచ్చిన మట్టి వల్లే ఇప్పుడున్న తీరం ఉంది. సముద్రంలోకి నదుల నీరు రాకపోవడంతో మట్టిరావడం తగ్గిపోయింది. దీంతో సముద్రపు తీరం కోతకు గురికావడం పెరిగిపోతుంది. కొల్లేరు పూడుకుపోవడం కారణంగా ఉప్పుటేరు కోతకు గురవుతోంది. పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో భవిష్యత్తులో ప్రమాదంగా మారనుంది.


సభలో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

160 స్థానాల్లో టిడిపిదే గెలుపు

నాలుగేళ్లలో ఎనిమిది లక్షల కోట్ల అప్పు చేసిన ముఖ్యమంత్రి జగన్
మినీ మహానాడులో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చన్నాయుడు

ప్రజాశక్తి - కాళ్ల

వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ 160 స్థానాల్లో విజయకేతనం ఎగురవేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని పెదఅమిరంలో తెలుగుదేశం పార్టీ జిల్లాస్థాయి మినీ మహానాడు సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పాలన సాగుతుందని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన వ్యక్తులపై, సంస్థలపై దాడులు చేయడం, జైల్లో పెట్టడం వంటి పనులు పనులతో పాలన సాగిస్తున్నారన్నారు. వైసిపికి అధికారం ఇచ్చి ప్రజలు అతిపెద్ద తప్పు చేశారన్నారు. కోడి కత్తి కేసు, బాబాయ్ హత్యలను సానుభూతిగా చూపి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్ కక్షసాధింపు ధోరణిలో పాలన సాగిస్తున్నారని విమర్శించారు. రాజధాని అమరావతిని జగన్ చిద్రం చేశారన్నారు. విద్యుత్, ఆర్‌టిసి, ఇంటి పన్ను, చెత్తపన్ను రూపంలో ప్రజల నుంచి రూ.మూడు లక్షల కోట్లను వసూలు చేసిందని ఆరోపించారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు కార్యకర్తలకు కొంత అన్యాయం జరిగిందని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రాగానే వారికి రాజ్యాంగబద్ధమైన పదవులు ఇస్తామని చెప్పారు. ఒకప్పుడు అన్నింట్లో ప్రథమ స్థానంలో ఉండే రాష్ట్రం ఇప్పుడు అట్టడుగున ఉందన్నారు. ఈ ముఖ్యమంత్రి కోసం తాను చెప్పనక్కర్లేదని, ప్రస్తుత మంత్రులు ధర్మాన, బొత్స వైసిపిలోకి రాక ముందే జగన్ ఏమిటో చెప్పారన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలకు లొంగితే మళ్లీ అరాచక పాలనే వస్తుందని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి పనిచేస్తేనే తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన వారమవుతామని అన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డి అరెస్టు విషయంలో సిబిఐ అధికారులు కూడా భయపడే పరిస్థితి ఎందుకని, కర్నూలు ఆసుపత్రిలో ఇతర రోగుల పరిస్థితి ఏమిటని నిలదీశారు. ఎపిలో అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని కర్నూలులో పరిస్థితి చూస్తే అర్థమవుతుందన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో 34 స్థానాలు గెలుస్తామని టిడిపి జోన్-2 ఇన్‌ఛార్జి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. జనసేన పార్టీతో పొత్తుతో అన్ని స్థానాలూ గెలిచి తీరుతామన్నారు. ఎన్‌టిఆర్ పార్టీ పెట్టిన రోజు రాష్ట్రంలో ఉన్న పరిస్థితులే ఇప్పుడూ ఉన్నాయన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా చిన్నాభిన్నమైందని విమర్శించారు. టిడిపిని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. గ్రామాల్లో మౌలిక సమస్యలు పరిష్కరించలేని వైసిపి ప్రభుత్వం పేదలపై బాదుడు కార్యక్రమాన్ని తలపెట్టిందని విమర్శించారు. బిజెపి ద్వంద్వ వైఖరి మార్చుకోవాలని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. రాష్ట్రంలో బిజెపి నాయకులు జగన్ ప్రభుత్వంపై ఒకవైపు ఛార్జిషీట్లు నమోదు చేస్తూ.. మరోవైపు అవినాష్‌రెడ్డి అరెస్టు విషయంలో ఉదాశీనంగా వ్యవహరిస్తూ ద్వంద్వవైఖరి అవలంబిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అసలు పోలీసు వ్యవస్థ ఉందా అని ప్రశ్నించారు. మీడియాపై అవినాష్ గూండాలు నిత్యం దాడులు చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. అన్ని రకాలుగా రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో బాయ్‌బాయ్ చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎం.ఎ.షరీఫ్, ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రి పీతల సుజాత, మాజీ ఎంఎల్‌ఎలు వివి.శివరామరాజు, ఆరిమిల్లి రాధాకృష్ణ, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు, నేతలు పొత్తూరి రామరాజు, వలవల బాబ్జి, ముత్యాల రత్నం, ముళ్లపూడి బాపిరాజు, కోళ్ల నాగేశ్వరరావు, పాతూరి రామచౌదరి, వీరవల్లి చంద్రశేఖర్, పాలి ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

పర్స జీవితం నేటి తరానికి ఆదర్శం

ప్రజాశక్తి - ఏలూరు

తెలంగాణ విప్లవ పోరాటయోధుడు, సిపిఎం రాష్ట్ర నాయకులు, మాజీఎంఎల్‌ఎ పర్స సత్యనారాయణ జీవితం నేటి కమ్యూనిస్టు నాయకులకు, కార్యకర్తలకు ఆదర్శమని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కొనియాడారు. పర్స సత్యనారాయణ ఎనిమిదో వర్ధంతిని సోమవారం స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సత్యనారాయణ చిత్రపటానికి రవి, కార్యకర్తలు, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ సత్యనారాయణ వీర తెలంగాణ విప్లవ పోరాటయోధునిగా, సింగరేణి కార్మికుడిగా జీవితాన్ని ప్రారంభించి అక్కడే సంఘాన్ని ఏర్పాటు చేసి సిఐటియు రాష్ట్ర అధ్యక్షునిగా, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా పని చేశారని తెలిపారు. ఆయన తుది శ్వాస విడిచే వరకూ ప్రజల గురించి, వారి సమస్యల గురించి ఆలోచిస్తూ, ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యపరుస్తూ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు నడిపారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రామకృష్ణ, కట్టా సత్యనారాయణ, లెనిన్, త్రినాధ్, ఎం.సత్యం, సింహాచలం పాల్గొన్నారు.


సిపిఎం కార్యాలయంలో..

సిఐటియు కార్యాలయంలో

సిఐటియు కార్యాలయంలో..

సిఐటియు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షులు పర్స సత్యనారాయణ వర్ధంతిని సిఐటియు జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. సత్యనారాయణ చిత్రపటానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సోమయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ సత్యనారాయణ తన జీవితాన్ని కార్మిక లోకానికి అంకితం చేశారన్నారు. సుమారు 50 ఏళ్లకుపైగా రాష్ట్రంలో కార్మిక సమస్యలపై ఎనలేని పోరాటాలు చేశారని తెలిపారు. కార్మికులు సాధించుకున్న అనేక చట్టాల వెనక పర్స సత్యనారాయణ వంటి కార్మిక నాయకులు కృషి దాగి ఉందన్నారు. ఆనాడు పోరాడిసాధించుకున్న చట్టాలను మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా మార్చేందుకు ప్రయత్నిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎల్‌ఎగా కూడా పనిచేసిన పర్స సత్యనారాయణ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో అలుపెరగని కృషి చేశారన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ సాధన కోసం ఎంఎల్‌ఎ పదవికి తృణప్రాయంగా రాజీనామా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.విజయలక్ష్మి, సిహెచ్.సుందరయ్య, వివిఎన్.ప్రసాద్, వి.సాయిబాబు, జె.గోపి, మహేశ్వరి జయసుధ పాల్గొన్నారు.

బిజెపి తీరుతో ప్రమాదంలో ఉపాధి హామీ

ప్రజాశక్తి - పెదవేగి

కోట్లాది మంది గ్రామీణ పేదలకు పట్టెడన్నం పెడుతున్న ఉపాధిహామీ చట్టం బిజెపి విధానాలతో నేడు ప్రమాదంలో పడిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ విమర్శించారు. ఉపాధి హామీ పనిలో కూలీలకు కనీస సౌకర్యాలు కలిపించాలని కోరుతూ సోమవారం మండలంలోని లక్ష్మీపురంలో ఉపాధి పని చేస్తున్న చెరువు వద్ద కూలీలతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామకష్ణ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు ఉపాధిహామీలో నేషనల్ మొబైల్ మోనటరింగ్ ఫొటో సిస్టం, రెండు పూటలా పని విధానం తీసుకువచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఉపాధి కూలీలకు తీవ్ర నష్టం కలుగుతుందని మండిపడ్డారు. ఈ పథకాన్ని ఎత్తివేసేందుకు బిజెపి చేసిన అనేక కుట్రల్లో భాగంగా కూలీలకు వేతనాలు, సమ్మర్ అలవెన్స్, మేట్ల పారితోషకం, ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులకు పాల్పడుతుందని వివరించారు. 2020లో కరోనా సమయంలో పేదల ఆకలిచావులు సంభవించకుండా కాపాడిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కేంద్ర బడ్జెట్‌లో బిజెపి రూ.30 వేల కోట్ల నిధులు తగ్గించి ఉపాధి హామీ పీక నొక్కిందన్నారు. అంటే ఏడాదికి కుటుంబానికి 22 పనిదినాలకు మాత్రమే ఆ నిధులు సరిపోతాయన్నారు. దీన్నిబట్టి బిజెపి పేదల పట్ల ఎలాంటివైఖరితో ఉందో అర్థమవుతుందన్నారు. బిజెపి విధానాలకు రాష్ట్రప్రభుత్వం వత్తాసు పలుకుతుందని మండిపడ్డారు. ఉపాధిహామీలో నేషనల్ మొబైల్ మోనటరింగ్ ఫొటో సిస్టంను వెంటనే రద్దు చేయాలని కోరారు. రెండు పూటలా పని విధానం రద్దు చేయాలన్నారు. సమ్మర్ అలవెన్సు, పే స్లిప్‌లు, ఇతర సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. పని ప్రదేశాల్లో ఆశా, ఎఎన్‌ఎంలను నియమించాలన్నారు. కుటుంబానికి 200 పనిదినాలు, రూ. 600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనుల్లో యంత్రాలు, కాంట్రాక్టర్లను నిషేధించాలని, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సైట్‌సూపర్‌వైజర్లకు పారితోషికం ఇవ్వాలని కోరారు. పట్టణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పనుల విస్తరణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఫీల్డు అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.

కూలీలతో మాట్లాడుతున్న పి.రామకృష్ణ

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు

స్మార్ట్ ప్రీ పెయిడ్ మీటర్ల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కమిటీ తరపున సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతుంటే వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం ప్రస్తుతం గృహ వినియోగ కనెక్షన్లకు కూడా స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు బిగించడానికి పూనుకోవడం దారుణమన్నారు. దీనివల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందని, ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వినియోగదారుల నుండి ముక్కుపిండి విద్యుత్ ఛార్జీలు వసూలు చేయడానికి, అదనపులోడ్, పీక్ డిమాండ్ పేరిట దోడ్డిదారిన అదనపు ఛార్జీల భారం వేసేందుకు అన్ని కనెక్షన్లకూ స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు బిగించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశం మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి చర్యకు పాల్పడడం తగదన్నారు. నెలకు 200 యూనిట్లు పైబడి వాడే గృహ వినియోగ కనెక్షన్లకు తొలి దశలోనూ, మిగతా వారికి రెండో దశలోనూ ప్రీపెయిడ్ మీటర్లు బిగించనున్నట్లు, అందుకు అదానీ కంపెనీకి టెండర్ ఖరారు కానున్నట్లు వార్తలొస్తున్నాయని, వినియోగదారుల జేబుకు చిల్లు పెట్టి అదానికి కట్టబెట్టే యోచన ప్రభుత్వం విరమించు కోవాలని కోరారు. బిజెపి ప్రభుత్వ విధానాలను ఇప్పటికే దేశ ప్రజలు వ్యతిరేకిస్తున్నారని అందుకు ఈ మధ్య జరిగిన కర్ణాటక రాష్ట్ర ఎన్నికలే నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను గుడ్డిగా అమలు చేయడం మానుకుని రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కాపాడాలని హితవుపలికారు. స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ప్రజల నుండి ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని, ప్రజలను సమీకరించి ఉద్యమాలు నిర్వహిస్తామని రవి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మున్సిపల్ కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలని వినతి

ఏలూరు అర్బన్: ఏలూరు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం ఎఐటియుసి అనుబంధ కార్మిక సంఘం ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడుతూ ఉద్యోగుల బకాయివేతనాల్లో కొంతభాగం గతనెలలో చెల్లించినందుకు కమిషనర్‌కు అభినందనలు తెలిపారు. జూన్‌లో విద్యాసంస్థలు తిరిగి ప్రారంభమవుతున్న దృష్ట్యా మిగిలిన బకాయిలు కూడా చెల్లించాలన్నారు. నగరపాలక సంస్థలో విలీనమైన ఉద్యోగ సిబ్బందికి బకాయి ఉన్న ఒక నెల వేతనం చెల్లించాలని కోరారు.

డిప్యూటీ డైరెక్టర్‌గా నాగార్జునకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - భీమవరం

సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దాసరి నాగార్జునకు డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. జిల్లా సమాచార శాఖ కార్యాలయంలో ఏడిగా పని చేస్తున్న నాగార్జునకు డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఆ శాఖ ఎక్స్‌అఫిషియో సెక్రటరీ టి.విజయకుమార్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన కాకినాడ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. నాగార్జున ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సమాచార శాఖ కార్యాలయంలో 2019 జులై నుండి సహాయ సంచాలకులుగా పని చేస్తున్నారు. నాగార్జున ఉద్యోగోన్నతిపై వెళ్తున్న సందర్భంగా మీడియా ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ సమ్మర్ క్యాంపు

15 రోజులపాటు విజయవంతంగా నిర్వహణ - ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు - అనేక అంశాల్లో శిక్షణ ఇచ్చిన ప్రముఖులు, ఉపాధ్యాయులు

బహుమతులు పొందిన విజేతలు

డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులు

ప్రజాశక్తి - ఏలూరు

హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్, హేలాపురి బాలోత్సవం సంయుక్తంగా 15 రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంపు ఉత్సాహభరితంగా సాగింది. ఏలూరులోని 10 కేంద్రాల్లో ఈనెల తొమ్మిదో తేదీ నుంచి 19వ తేదీ వరకూ పది రోజుల పాటు స్పోకెన్ ఇంగ్లీష్, హ్యాండ్ రైటింగ్, క్రాఫ్ట్, పాటలు, పద్యాలు, ఆటలు వంటి అంశాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహించారు. పవర్‌పేటలోని అన్నే భవనం, భగత్‌సింగ్ నగర్ టైటాస్ నగర్ హైస్కూల్, వైఎంహెచ్‌ఎ బాలల శాఖా గ్రంథాలయం, నాగేంద్ర కాలనీ, వంగాయగూడెం, పోణంగి వైఎస్‌ఆర్ కాలనీ, వెన్నవల్లివారిపేటలో జరిగిన ఈ క్యాంపుల్లో ఆయా ప్రాంతాలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 20, 21, 22 తేదీల్లో నగరస్థాయిలో గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్, సుబ్బమ్మ దేవి హైస్కూళ్లలో నిర్వహించిన సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు డ్రాయింగ్‌పై ప్రముఖ చిత్రకారులు మజ్జి కాంతారావు శిక్షణ ఇచ్చారు. తెలుగు భాష తియ్యదనం గురించి ప్రత్యేక అంశాల గురించి రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ వై.ఆనందనాయుడు వివరించారు. సులభ గణితంపైన, పదో తరగతి తర్వాత భవిష్యత్తు ప్రణాళికల గురించి కూడా ఆనందనాయుడు అవగాహన కల్పించారు. హ్యాండ్ రైటింగ్ అభివృద్ధిపై టి.తులసి, సిహెచ్.జగదీష్ శిక్షణ ఇచ్చారు. స్పోకెన్ ఇంగ్లీష్‌ను జంగిల్ బెల్ స్కూల్ డైరెక్టర్ వి.సురేష్ బోధించారు. సెల్ఫ్ డిఫెన్స్, కరాటేలో ఇబ్రహీం బేగ్ బృందం శ్రీనివాస్, లక్ష్మీనారాయణ శిక్షణ ఇచ్చారు. పాటలపై గంగాభవాని, ఎస్.రవి తర్ఫీదు ఇచ్చారు. పేపర్ క్రాఫ్ట్ ద్వారా పిల్లల నేర్పరితనాన్ని పెంచేందుకు జి శారద, భవాని ప్రత్యేక తరగతులు బోధించారు.

సుబ్బమ్మదేవి హైస్కూల్లో ముగింపు సభ

రాజారామ్మోహన్‌రాయ్ జయంతి సందర్భంగా సోమవారం సమ్మర్ క్యాంపు ముగింపు సభను స్థానిక సుబ్బమ్మదేవి హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు డ్రాయింగ్, తెలుగు, ఇంగ్లీష్, హ్యాండ్ రైటింగ్, పేపర్ క్రాఫ్ట్‌లో పోటీలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభకు ప్రతినిధులను ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు మేతర అజయ్‌బాబు స్వాగతం పలికారు. విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ వైద్యులు రావి గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించాలంటే అన్ని అంశాల్లోనూ ప్రావీణ్యం సాధించాలన్నారు. స్కూళ్లలో అందుకు తగిన వసతులు, బోధన ఏర్పాట్లు ఉండాలని చెప్పారు. తొలుత రాజారామ్మోహన రాయ్ చిత్ర పటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎల్‌వి.లలిత రాజారామ్మోహన్‌రాయ్ వేషధారణతో అందరినీ అలరించారు. సుబ్బమ్మ దేవి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు కుటుంబరావు మాట్లాడుతూ తమ స్కూల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించిన కమిటీ వారికి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం ఈ సంవత్సరం నుండి సిబిఎస్‌ఇ సిలబస్ బోధనకు అవకాశం ఇచ్చిందని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. అలాగే పదో తరగతిలో 550కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 25 మందికి ప్రశంసాపత్రాలు, మెమెంటోలు, అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు. అందరికీ జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో హేలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, హేలాపురి వేసవి ఉత్సవం ప్రధాన కార్యదర్శి అడుసుమిల్లి నిర్మల, రావి పద్మకుమారి, సుబ్బమ్మ దేవి హైస్కూల్ హెడ్ మాస్టర్ పి.కుటుంబరావు, హేలాపురి బాలోత్సవం ట్యూషన్ సెంటర్ల సమన్వయకర్త జి.శారద, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు వై.ఆనందనాయుడు, ఎంఎస్.కాంతారావు, పి.కస్తూరిబాయి, వి.సురేష్, ఎస్.రవి పాల్గొన్నారు.

భీమడోలులో 40,439 టన్నుల ధాన్యం సేకరణ

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలో ధాన్యం సేకరణ కార్యక్రమం దాదాపుగా పూర్తయినట్లు వ్యవసాయ అధికారి ఉషారాణి తెలిపారు. మండలంలో సాగు జరిగిన 13,250 ఎకరాల నుంచి 57 వేల టన్నుల ధాన్యం ఉత్పత్తి జరుగుతుందని అంచనా వేశారన్నారు. ఈ క్రమంలో తొలుత 50 శాతం ధాన్యం సేకరణకు లక్ష్యంగా నిర్ణయించి ధాన్యం సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఆ తర్వాత చోటు చేసుకున్న వివిధ కారణాలతో మండలం నుంచి ధాన్యం సేకరణ లక్ష్యాన్ని 47 వేల టన్నులకు పెంచారన్నారు. ఇదే క్రమంలో మండల పరిధిలో 4624 మంది రైతులు ఇ క్రాప్‌లో నమోదయ్యారన్నారు. వీరిలో 3571 మంది రైతులకు చెందిన 40,439 టన్నుల ధాన్యం సేకరణ ఇప్పటివరకు జరిగిందన్నారు. వీరందరికీ రూ.82.53 కోట్లు ధాన్యం సేకరణ కింద చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు 3,552 మంది రైతులకు రూ.68.10 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన 1039 రైతులకు రూ.14.42 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. వీరందరూ వారం క్రితం ధాన్యాన్ని తరలించిన నేపథ్యంలో త్వరలో వీరికి ఆ మొత్తాలు వారి ఖాతాలకు జమ కానున్నాయన్నారు. ఇక భీమడోలు మండలంలో ధాన్యం సేకరణకు నాలుగు ఏజెన్సీలకు బాధ్యతలను అప్పగించారన్నారు. వీరిలో పూళ్ళ, భీమడోలు సొసైటీల పరిధిలోని కొంతమంది రైతుల నుంచి మాత్రమే ఇంకా ధాన్యం రావాల్సి ఉందన్నారు. మిగిలిన ఏజెన్సీలు వారి వారి పరిధిలో పూర్తిస్థాయిలో ధాన్యం సేకరణ చేశారని వ్యవసాయ అధికారి వివరించారు.

విశ్వనాథరెడ్డి మృతి తీరని లోటు

ప్రజాశక్తి - ఏలూరు

భారతీయ సాహిత్యంలో తెలుగు కథను ఉన్నత శిఖరానికి చేర్చిన కథకుడు కేతు విశ్వనాథరెడ్డి మృతి తీరని లోటని సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కడలి రామాంజనేయులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాహితీ స్రవంతికి ప్రారంభం నుంచి తోడ్పాటునందించి సాహిత్య ప్రస్థానం మాసపత్రికలో అనేక కథలు వ్యాసాలు అందించారని తెలిపారు. కథాసాహిత్యంలో ఆయన చిరస్మరణీయమైన కృషి చేశారని పేర్కొన్నారు. అభ్యుదయ రచయితల ఉద్యమంలో విశాలాంధ్ర ప్రచురణాలయంలో కీలకబాధ్యతలు నిర్వహించారని తెలిపారు. పాఠ్యపుస్తకాలు, సార్వత్రిక విశ్వవిద్యాలయ సిలబస్‌ను రూపొందించడంలో, భాష, మాండలిక ప్రయోగాల అధ్యయనంలో, రాయలసీమ వేదనలకు అక్షరరూపం ఇవ్వడంలో ఆయనది గొప్ప ముద్ర అని పేర్కొన్నారు. కేతువిశ్వనాథరెడ్డి మరణం పట్ల సంతాపాన్ని, ఆయన కుటుంబానికి సానుభూతిని ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - టి.నరసాపురం

వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో సోమవారం విజ్ఞాన శిబిరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించుకోవడానికి వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. ఈ వేసవి శిబిరాల్లో విద్యార్థులకు కథలు, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, చిత్ర లేఖనం వంటి సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

కలిదిండి : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆధునిక భారతదేశ పితామహుడు రాజా రామ్మోహన్ రాయ్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సతీ సహగమనాన్ని రూపు మాపడంలో, బాల్య వివాహాలను నిర్మూలించడంలో, స్త్రీ విద్యను ప్రోత్సహించడంలో ఆయన చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. అనంతరం పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహించినట్లు శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు తెలిపారు. ఉపాధ్యాయులు డివి.నరేష్, పురుషోత్తం పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - ముసునూరు

మండల పరిధిలోని గోపవరం గ్రామ పంచాయతీలో సుమారు పది రోజుల నుంచి నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారంతో సాయంత్రంతో ముగిశాయి. ఈ పోటీలో గోపవరం జట్టుపై కాట్రేనిపాడు ఎనిమిది పరుగుల తేడాతో విజయం సాధించింది. కాట్రేనిపాడు జట్టుకు గోపవరం మాజీ ఉపసర్పంచి మాకినేని నాగార్జున రూ.వేలు అందించారు. గోపవరం జట్టుకు రూ.4500 గ్రామ ప్రముఖుడు కాపుదాసి వెంకటేశ్వరరావు అందించారు. మూడో బహుమతి రూ.మూడు వేలు మాజీ సర్పంచి నందిగం శ్రీనివాసరావు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కంచర్ల వాణి, ఎంపిటిసి-2 పాముల గంగాధరరావు పాల్గొన్నారు.

పాఠశాలకు బడిబయట పిల్లలు

ప్రజాశక్తి - ముసునూరు



బడిబయట పిల్లలను చేర్పించుకుంటున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ ఆదేశాల మేరకు బడిబయట ఉన్న విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించుకుంటున్నట్లు వేల్పుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ ఎల్‌విఎస్.నాగేంద్రరావు అన్నారు. మండలంలోని వేల్పుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలో ఉన్న అన్నపనేనివారిగూడెం, చిల్లబోయినపల్లి, వేల్పుచర్ల గ్రామాల్లో బడి బయట పిల్లలను పాఠశాలలో జాయినింగ్ చేసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

చిరిగిన గోనెసంచులతో రైతుల నిరసన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

చిరిగిన గోనె సంచులతో లక్కవరం రైతులు ఆర్‌బికె వద్ద సోమవారం నిరసన తెలిపారు. చిరిగిన గోనె సంచులు సరఫరా చేయడంపై పలువురు రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రైతు భరోసా కేంద్రం సిబ్బందితో రైతులు వాదన పడ్డారు. ప్రభుత్వం అందిస్తున్న గోనెసంచులను దళారులతో కుమ్మక్కై మార్చి వేస్తున్నారని విమర్శించారు. చిరిగిన సంచులలో ధాన్యం ఎలా నింపాలని ప్రశ్నించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి సరైన గోనె సంచులు పంపిణీ చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ప్రశాంతంగా ఎపిఇఎపి సెట్

ఏలూరు అర్బన్: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎపిఇఎపిసెట్ పరీక్ష ఆరో రోజు సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఏలూరులోని మూడు కేంద్రాలు వట్లూరులోని సిఆర్.రెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల, సిద్ధార్థ క్వెస్ట్, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలల్లో రెండు షిఫ్ట్‌లలో నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 941 మందికి 895 మంది హాజరయ్యారు. 46 మంది గైర్హాజరయ్యారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకూ జరిగిన మొదటి షిఫ్ట్‌లో సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో 182 మందికి 172 మంది హాజరయ్యారు. పదిమంది గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో 139 మందికి 135 మంది హాజరయ్యారు. సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 150 మందికి 143 మంది హాజరయ్యారు. మొత్తం ఉదయం షిఫ్ట్‌లో 471 మందికి 450 మంది, మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఆరు గంటల వరకు జరిగిన రెండో షిఫ్ట్‌లో సిద్ధార్థ క్వెస్ట్‌లో 181 మందికి 172 మంది, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో 139 మందికి 131 మంది, సిఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 150 మందికి 142 మంది హాజరయ్యారు.

జ్యూట్ కార్మికులకు పరిహారమివ్వకుండా

రియల్ ఎస్టేట్ వ్యాపారం తగదు

ఏలూరు అర్బన్: చట్టవిరుద్ధంగా ఏలూరు జ్యూట్ మిల్లును మూసివేయడమే కాకుండా కార్మికులకు రావాల్సిన పరిహారాలు చెల్లించకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలనే మేనేజ్‌మెంట్ వైఖరిని ఖండిస్తూ ఐఎఫ్‌టియు ముద్రించిన కరపత్రాలను సోమవారం కొత్తూరు జ్యూట్‌మిల్లు వద్ద ఆవిష్కరించారు. ఏలూరు జ్యూట్ మిల్లు కార్మికులకు న్యాయం చేయాలని, కార్మికులకు ఇవ్వాల్సిన రాయితీలు చెల్లించాలని, యాజమాన్యం మొండివైఖరి వీడాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత ఏడాది జనవరి 27న మేనేజ్‌మెంట్ ఏలూరు జూట్ మిల్లును చట్ట విరుద్ధంగా మూసివేసిందని, అప్పటి నుండి మిల్లును తెరవలేదు సరికదా కార్మికులకు చట్టపరంగా చెల్లించాల్సిన రాయితీలు చెల్లించడం లేదని విమర్శించారు. ఏలూరు మిల్లు ఆస్తులమ్ముకుంటే రూ.వందల కోట్లు మేనేజ్‌మెంట్‌కు లభిస్తాయని, కానీ కార్మికులకు ఐదారు కోట్ల రూపాయలు చెల్లించడానికి కూడా యాజమాన్యం ముందుకురావడం లేదని వారు విమర్శించారు. మేనేజ్‌మెంట్ తన మొండివైఖరి వీడి కార్మికులకు న్యాయమైన పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్మికులకు ఉద్యమ చైతన్యం కల్పించేందుకు ఈనెల 25వ తేదీన బహిరంగసభను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

నేరాలు - ఘోరాలు

లారీ దగ్ధం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టులో దిగువ కాపర్ డ్యాం వద్ద సోమవారం ఇసుక తరలిస్తున్న లారీ దగ్ధమైంది. పోలవరం ప్రాజెక్టు కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం దిగువ కాపర్ డ్యామ్‌కు దిగువన ఇసుక తిన్నెల నుండి డయాఫ్రంవాల్ ప్రాంతానికి ఇసుక తరలిస్తున్న లారీ బ్యాటరీ వైర్లు షార్ట్‌సర్క్యూట్ కావడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం గుర్తించి అప్రమత్తమైన డ్రైవర్ లారీ నుంచి దూకి బయటపడటంతో ప్రాణాపాయం తప్పింది.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

'టిడిపి పటిష్టతకు కృషి'

ప్రజాశక్తి - టి.నరసాపురం

టిడిపి పటిష్టతకు కృషి చేస్తామని ఇటీవల తెలుగు యువత రాష్ట్ర కార్యవర్గంలో పదవులు పొందిన తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వాసిరెడ్డి మోహన్‌రావు అన్నారు. వారు సోమవారం బుట్టాయగూడెంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులును, టి.నరసాపురం మండలంలోని వీరభద్రవరం గ్రామంలోని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు పదవులు రావడానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపి వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు అప్పగించిన పదవులు బాధ్యతతో నిర్వహించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ బిసి సెల్ ఉపాధ్యక్షుడు శ్రీను, సందేపూడి సాయి పాల్గొన్నారు.

ఇంటర్నెట్ వైర్లను ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో కేబుల్ టీవీ, ఇంటర్నెట్ వైర్లను ధ్వంసం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని జంగారెడ్డిగూడెం కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ఎండి పాలపర్తి శ్రీనివాస్ కోరారు. కేబుల్ టీవీ, ఇంటర్నెట్ వైర్లను ధ్వంసం చేయడంపై కేబుల్ టీవీ సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషన్లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎండి పాలపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎయిర్టెల్ ఎక్స్‌ట్రీమ్ ఇంటర్నెట్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు తెలిపారు. గత 30 సంవత్సరాలుగా కేబుల్ టీవీ ప్రసారాలను, గత పది సంవత్సరాలుగా బ్రాడ్ బ్యాండ్ సేవలను అందిస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొన్ని రోజులుగా ఎయిర్టెల్ ఎక్స్‌ట్రీమ్ ఇంటర్నెట్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేస్తున్నారన్నారని తెలిపారు. దీంతో వినియోగదారులు అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. ఇటువంటి చర్యలు మానుకోవాలన్నారు. వైర్లు ధ్వంసం చేసే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బాలికల జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



నూతన అధ్యాపకులతో ప్రధానోపాధ్యాయురాలు

స్థానిక జిల్లా పరిషత్ బాలిక ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరానికి బాలికల నుంచి అడ్మిషన్లు స్వీకరించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గ్లోరిప్రశాంతి తెలిపారు. సోమవారం కళాశాలలో నూతనంగా నియమించిన అధ్యాపకులను ఆమె స్వాగతించారు. ఈ సందర్భంగా గ్లోరిప్రశాంతి మాట్లాడుతూ పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలు ఈ కళాశాలలో అడ్మిషన్లు పొందాలని సూచించారు. బైపిసి, సిఇసి, ఇంగ్లీషు మీడియంలో విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. ఈ సదవకాశాన్ని విద్యార్థినుల తల్లిదండ్రులు గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అడ్మిషన్ల కోసం 9948390202, 9290523167 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

పోలీస్ అవుట్‌పోస్టులో సిబ్బందిని నియమించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పోలీస్ అవుట్ పోస్టు సేవలు సక్రమంగా అందించాలని రైతు సంఘం నాయకులు బొడ్డు రాంబాబు కోరారు. ఏరియా ఆసుపత్రి పోలీస్ అవుట్ పోస్టులో రెగ్యులర్ సిబ్బందిని నియమించాలని కోరుతూ స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆర్‌డిఒ ఝాన్సీ రాణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బొడ్డు రాంబాబు మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో పోలీస్ అవుట్ పోస్టు సిబ్బంది అందుబాటులో లేకపోవడం వల్ల క్షతగాత్రులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారని తెలిపారు. పలురకాల రోడ్డు ప్రమాదాల్లో గాయాలపాలైనవారు, వారి కుటుంబసభ్యులు అవుట్‌పోస్టు వద్ద పోలీస్‌సిబ్బంది లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లలో సంప్రదిస్తే ఇతర ప్రాంతాల కేసులు తమకు సంబంధంలేదని బదులు చెప్పుతున్నారని వాపోయారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఏరియా ఆసుపత్రి పోలీస్ అవుట్ పోస్టులో రెగ్యులర్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు.

50 మందికి పిఎంఇజిపి రుణాలు

ప్రజాశక్తి - భీమడోలు

ప్రధానమంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమం (పిఎం ఇజిపి) కింద రూ.లక్ష నుంచి రూ.పది లక్షల వరకు రుణాల కోసం భీమడోలు మండలానికి చెందిన 50 మంది ఆసక్తి కనపరిచారని వైఎస్ఆర్ క్రాంతి పథం భీమడోలు ఎపిఎం సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు 57 రంగాల్లో ఉపాధి కల్పన రుణాలను ఇచ్చేందుకు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ముందుకు వచ్చిందని చెప్పారు. వీటిలో మండలం నుంచి 19 విభాగాల్లో రుణాల కోసం 50 మంది ఆసక్తి కనబరిచారన్నారు. వీరందరిని స్థానిక ఎపిఎం కార్యాలయం నుంచి ఏలూరులో ఈ నెల 23వ తేదీన కలెక్టర్ ఆధ్వర్యంలో బ్యాంకు ద్వారా నిర్వహించే రుణమేళా కార్యక్రమానికి తీసుకు వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. అక్కడ రుణాలు కేటాయించే వివిధ రంగాలకు చెందిన అంశాలను ప్రదర్శనగా ఉంచుతారన్నారు. వాటి నుంచి లబ్ధిదారులు ఎంపిక చేసుకున్న అంశం ఆధారంగా రుణం కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. వీరు తమతో పాటు ఆధార్, పాన్ కార్డుతో పాటు మూడు ఫొటోలు తీసుకువెళ్లాలన్నారు. వీరికి గ్రామ సమాఖ్య సహాయకులు సహకారం అందిస్తారన్నారు. వీటితోపాటు మండల పరిధిలో వివిధ సెక్టార్‌లో పనిచేసే సీసీలు హాజరవుతారన్నారు. ఇదే క్రమంలో ఎంపికైన లబ్ధిదారులకు రుణాలను హామీ లేకుండా ఇస్తారన్నారు. రుణ మొత్తంలో పది శాతం వ్యక్తిగత వాటా 35 శాతం రాయితీ, 55 శాతంగా రుణంగా ఉంటాయన్నారు. ఇదే క్రమంలో స్థానిక ఐకెపి కార్యాలయం ద్వారా ఇదే కార్యక్రమం కింద 50 మందికి రూ.లక్ష లోపు రుణాలను అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. వీరికి స్త్రీనిధి, డ్వాక్రా గ్రూపులకు ఇచ్చే రుణాలను అందిస్తామని ఎపిఎం తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

ర్యాలీలో ఎల్ఎస్.భాస్కరరావు

ప్రజాశక్తి - మండవల్లి

అభివృద్ధి పేరుతో ప్రకృతిని ధ్వంసం చేయడంతో సమతుల్యం లోపించి జీవన వైవిధ్యం దెబ్బతిని జీవరాసుల మనుగడ ప్రమాదంలో పడే పరిస్థితులు నెలకొన్నాయని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం మండవల్లిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుడు తన స్వార్థం కోసం చేస్తున్న విధ్వంసాల వల్ల జీవరాసుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిపోయిందన్నారు. పెరుగుతున్న జనాభా పట్టణీకరణ పారిశ్రామికీకరణ వల్ల సహజ వనరులపై తీవ్ర ఒత్తిడి ఏర్పడి దానివల్ల కాలుష్యం పెరిగిపోయిందన్నారు. అడవులు నరకడం, రసాయన ఎరువులు, ప్లాస్టిక్ వినియోగం, ఖనిజాల కోసం పర్వతాలను తవ్వేయడం వంటి అనేక చర్యల ఫలితంగా అసంఖ్యాక జంతు పక్షి వృక్ష జాతులు అంతరించిపోయి జీవన వైవిధ్యం దెబ్బ తినే ప్రమాదం ఉందన్నారు. చిత్తడి నేలల కొల్లేరు సరస్సు కాలుష్యం కోరల్లో చిక్కుకోవడంతో పాటు కొల్లేరు మహా మంచినీటి సరస్సు ఏడాది ఏడాదికి కుచించుకుపోవడం వల్ల జీవరాసుల మనుగడకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. కొల్లేటి మహా మంచినీటి సరస్సును పరిరక్షించుకోవడానికి ప్రతిఒక్కరూ నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆక్రమణలు తొలగించి కొల్లేరు సరస్సులో రెగ్యులేటర్ నిర్మాణం చేపట్టడం ద్వారా కొల్లేరు చిత్తడి నేలల అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అనంతరం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక మండల శాఖ అధ్యక్షులు డి.అప్పారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏరియా ప్రభుత్వాసుపత్రి ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



ఏలూరులో ఏరియా ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని, జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రద్దుకాబడిన వైద్యులు, వైద్య సిబ్బంది, బెడ్లను పునరుద్ధరించాలని, మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన వివిధ రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. సోమవారం పవర్‌పేటలోని సిపిఎం కార్యాలయంలో సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కిషోర్ మాట్లాడుతూ ఎట్టకేలకు ఏలూరులో ప్రభుత్వ బోధన (మెడికల్ కాలేజీ) ఆసుపత్రికి అనుమతి ఇవ్వడం సంతోషదాయకమన్నారు. కానీ బోధన ఆసుపత్రి పేరుతో జిల్లా నలుమూలల నుండి ఏలూరు వస్తున్న పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలను రద్దు చేయడం వల్ల ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న 42 స్పెషలిస్టు వైద్యులు, 150 మంది వరకు వైద్య సిబ్బంది, 350 బెడ్లు రద్దయ్యాయన్నారు. ఏలూరు ఆసుపత్రికి వస్తున్న రోగులను విజయవాడ, గుంటూరుకు పంపిస్తున్నారని, అక్కడ వరూ వెళ్లలేని రోగులు ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించి అప్పులపాలవుతున్నారన్నారు. ఏలూరు మెడికల్ కాలేజీ పూర్తి కావాలంటే మూడు నుండి ఐదు సంవత్సరాల సమయం పడుతుందని, ప్రస్తుతం మెడికల్ కాలేజీకి ఒక్కొక్క విభాగానికి మూడు యూనిట్లు చొప్పున పర్మిషన్ రావాల్సి ఉండగా ఒక్కో యూనిట్‌కే అనుమతి వచ్చిందన్నారు. ఒక్క యూనిట్‌లో ప్రతి విభాగానికి ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్స్ ఉంటారని, ఆ తరువాత వారికి సహాయకులుగా వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఉంటారని తెలిపారు. ఇది మొదటి సంవత్సరమే కావడం వల్ల వైద్య విద్యార్థులు కూడా పూర్తిగా అందుబాటులో లేని పరిస్థితి ఉందన్నారు. సిపిఐ నగర సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, ఆమ్ ఆద్మీ జిల్లా కన్వీనర్ సురేష్, జనసేన టౌన్ ప్రెసిడెంట్ కాశి నరేష్ తదితరులు మాట్లాడారు. ప్రభుత్వాసుపత్రి అంటేనే పేదలు మాత్రమే వైద్యం కోసం వస్తుంటారని, అలాంటి సేవలు ఇలా అకస్మాత్తుగా నిలిపివేయడం తగదన్నారు. ప్రభుత్వాసుపత్రిలో సిటీ, ఎంఆర్ఐ స్కాన్ల కోసం రోగులను బయటకు పంపుతున్నారని, అలాకాకుండా ఆసుపత్రిలోని అన్ని రకాల పరీక్షలు నిర్వహించి, అదే రోజు రిపోర్టులు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఐసియులో ఎసిలు పనిచేయడం లేదన్నారు. ఈనెల 23వ తేదీన ప్రభుత్వాసుపత్రిలో అఖిలపక్ష పార్టీల నాయకత్వం పర్యటించి స్వయంగా సమస్యలు తెలుసుకుంటుందని తెలిపారు. అనంతరం అధికారులకు, ఎంఎల్ఎలకు వినతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ ఏలూరు కన్వీనర్ షేక్ మస్తాన్ వలీ, సిపిఐ నాయకులు బి.ప్రసాద్, పొట్టేలు పెంటయ్య, సిపిఎం నగర కమిటీ సభ్యులు వి.సాయిబాబు, జె.గోపి, జి.రుక్మనందనరావు, కాంగ్రెస్ పార్టీ ఏలూరు నాయకులు దండుబోయిన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మద్ది ఆలయానికి రూ.40 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి ఆలయానికి యాత్రికుల విరాళాల ద్వారా రూ.40,08,351 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.కొండలరావు తెలిపారు. సోమవారం ఉదయం ఆలయంలో అత్యంత భద్రతా ఏర్పాట్ల మధ్య హుండీలను లెక్కించారు. 67 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందని ఇఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ-ధర్మాదాయ శాఖ తనిఖీదారు, ఎ.సుజన్ కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు దండు వెంకట కృష్ణంరాజు, మానికల బ్రహ్మానందరావు, కరూర్ వైశ్యాబ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

చేతబడి కలకలం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట సోమవారం తెల్లవారుజామున చేతబడి కలకలం సృష్టించింది. కళాశాలకు వచ్చే ప్రధాన రహదారిపై ఎరుపు అన్నం ముద్దలు, ఎండుమిర్చి, ఇనుప మేకు, వెంట్రుకలు, కోడిగుడ్లు, రక్తం మరకలు, ఒక పుర్రె, కొన్ని బొమ్మలున్నాయి. నిత్యం కళాశాలకు విద్యార్థులు వస్తూ ఉంటారని, ప్రధాన రహదారిపై ఇలా చేయటం పట్ల స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

'సుందరయ్య' స్ఫూర్తితో సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి - ఏలూరు

సిపిఎం అండతో పోరాడి సాధించుకున్న సుందరయ్య కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం అదే స్ఫూర్తితో పోరాడాలని సుందరయ్య కాలనీవాసులకు సిపిఎం జిల్లాకార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి ఏలూరు వెంకటాపురం పంచాయతీలోని సుందరయ్య కాలనీ 17వ వార్షికోత్సవం స్థానిక శాఖ కార్యదర్శి సాయిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రవి మాట్లాడుతూ 16 సంవత్సరాల క్రితం ఏలూరులో సుందరయ్య కాలనీ నివాసాలను సిపిఎం అండతో పేదలు సాధించుకున్నారన్నారు ఇప్పటికి 17 సంవత్సరాల పూర్తవుతున్నప్పటికీ కాలనీలో రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీ తదితర సమస్యలను పట్టించుకోవడంలేదన్నారు. అప్పటి కాంగ్రెస్ మొదలుకొని తరువాత వచ్చిన తెలుగుదేశం, వైసిపి కాలనీ ప్రజల సమస్యలు పట్టించుకోలేదన్నారు. సిపిఎం నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ మాట్లాడుతూ వెంకటాపురం పంచాయతీ హనుమాన్ నగర్ కాశీ కాలువ గట్టున సిపిఎం 2007లో వన్‌టౌన్‌లోని 24 ప్రాంతాలకు చెందిన పేదలను గుర్తించి ఈ ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం సుమారు 230 కుటుంబాలు నివసిస్తున్నాయని అన్నారు. 2007లో ఇళ్ల స్థలాల పోరాట సమయంలో పేదలకు ఈ స్థలాలు ఇవ్వకుండా అప్పటి ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి అడ్డుకోవాలని చూసిందని అన్నారు. అంతే కాకుండా అప్పట్లో ఈ స్థలాలపై కొందరు ప్రయివేటు వ్యక్తులు కన్నేసి, ఈ పోరాటం నడుపుతున్న పార్టీ నాయకులు పి.కిషోర్‌పై హత్య ప్రయత్నానికి ఒడిగట్టారని తెలిపారు. ఈ సభలో సిపిఎం నగర కమిటీ సభ్యులు ప్రసాద్, హనుమాన్ నగర్ సిపిఎం నాయకులు చల్ల పైడయ్య, సత్తిరాజు, సుందరయ్య కాలనీ నివాసితులు గురుమూర్తి చిన్నారావు, రామలక్ష్మి, రాములమ్మ, మేరమ్మ పాల్గొన్నారు.

సివిల్ తగాదాలు కోర్టుల్లోనే పరిష్కారం : ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సివిల్ తగాదాలను న్యాయస్థానంలో పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి తెలిపారు. ఏలూరు నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రతీ సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సివిల్ సంబంధిత వ్యాజ్యాలను పోలీస్ స్టేషన్లలో పరిష్కరించబడవని స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాగే నేరస్తులు సరికొత్త తరహాలలో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని ఆమె తెలిపారు. ఇలాంటి వారి వలలో పడకుండా ఉండాలంటే అపరిచిత వ్యక్తులకు తమ విలువైన సమాచారాన్ని తెలియచేయొద్దని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆర్‌డిఒ ఎం.ఝాన్సీరాణి తెలిపారు. జీలుగుమిల్లి తహశీల్దార్ కార్యాలయంలో ఆర్‌డిఒ లాగిన్‌లో దరఖాస్తు చేసుకున్న ఆరు ఫిర్యాదులపై వివరాలను ఇన్‌ఛార్జి తహశీల్దార్ సందీప్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి వీలైనంత త్వరితగతిన పూర్తయ్యేలా పరిష్కరించాలని కోరారు. మండలంలోని భూ సంబంధిత సమస్యలను పారదర్శకంగా పరిష్కరించాలని తెలిపారు.



వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచి

సచివాలయానికి వాటర్ కూలర్ వితరణ

ప్రజాశక్తి - మండవల్లి

వేసవిలో వాటర్ కూలర్‌ను సద్వినియోగం చేసుకుని దాహార్తిని తీర్చుకోవాలని కార్యదర్శి తోట శ్రీనివాసరావు తెలిపారు. కీర్తిశేషులు మెండ హిజ్కియా తెరెసా జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సురేష్‌బాబు రూ.12 వేల విలువైన వాటర్ కూలర్‌ను మండవల్లి సచివాలయానికి వితరణగా అందించడం అభినందనీయమన్నారు. వివిధ అవసరాలపై సచివాలయానికి వచ్చే ప్రజలు సచివాలయ సిబ్బంది వాటర్ కూలర్ ఫ్రిజ్‌ను సద్వినియోగం చేసుకుని దాహార్తిని తీర్చుకోవాలన్నారు. అనంతరం సర్పంచి మెండ ఝాన్సీ ఫ్రిజ్‌ను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు

25న వాలంటీర్లకు సేవా పురస్కారాలు

ప్రజాశక్తి - భీమడోలు

విధి నిర్వహణలో ఉన్నత స్థాయి ప్రమాణాలను అమలు చేసిన వాలంటీర్లను ఈ నెల 25న ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు చేతులమీదుగా భీమడోలులో సన్మానించనున్నట్లు ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి తెలిపారు. వాలంటీర్ల పనితీరు ఆధారంగా వారికి సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర విభాగాలు వారీగా నగదు పురస్కారం, ఇతర సత్కారాలు అందుతాయన్నారు. దీనిలో భాగంగా సేవా వజ్రగా భీమడోలు నెంబర్-1 సచివాలయానికి చెందిన బండారు ప్రదీప్, సేవా రత్న కింద గుండుగోలను నెంబర్-2 సచివాలయానికి చెందిన జి.బిందుమాధవి, జి.ధరణి, సూరప్పగూడేనికి చెందిన ఎం.సూర్యకుమారి, కురెళ్లగూడేనికి చెందిన రుక్మిణి, పూళ్ల సచివాలయం-1 చెందిన బి.వెంకటలక్ష్మిలతో పాటు సేవా మిత్రలుగా ఎంపికైన పదుల సంఖ్యలో వాలంటీర్లను ఎంఎల్ఎ తెలిపారు.

బంగారమ్మపేటలో షూటింగ్ సందడి

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని బంగారమ్మపేటలో సోమవారం షూటింగ్ సందడి నెలకొంది. ఎన్‌విఆర్ క్రియేషన్స్‌లో సాయిరాం శంకర్ హీరోగా నిర్మిస్తున్న సినిమా షూటింగ్‌ను స్థానిక దుర్గమ్మ గుడి వద్ద పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక యువకుడు, నూతన దర్శకుడు జూరెడ్డి ప్రకాష్ మాట్లాడుతూ 1955లో పోలవరంలో జరిగిన ఓ యధార్థ ఘటన ఆధారంగా ఈ చిత్రం నిర్మిస్తున్నామన్నారు. కథ వినగానే హీరోగా నటించడానికి ఒప్పుకున్న ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ తమ్ముడు సాయిరాం శంకర్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఈ చిత్రానికి మ్యూజిక్ మాస్ట్రో ఇళయరాజా సంగీత దర్శకత్వం ప్లస్ పాయింట్‌గా నిలుస్తుందన్నారు. జూన్ నెల నుండి 40 రోజులు పాటు పోలవరం పరిసర ప్రాంతాల్లో షూటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. చిత్ర హీరో మాట్లాడుతూ ఇంకా పేరు నిర్ణయించిన ఈ చిత్రానికి కథ, రచన, దర్శకత్వం వహిస్తున్న ప్రకాష్ తొలిచిత్రం విజయవంతం కావాలని ఆశిస్తున్నామని, కొన్ని సన్నివేశాలను హైదరాబాదులో చిత్రీకరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఆర్టిస్టులు దండు సత్యనారాయణ రాజు, సుబ్బరాజు పాల్గొన్నారు.

నేడు వాలంటీర్లకు పురస్కారాలు

ముదినేపల్లి: స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో వాలంటీర్లకు మంగళవారం పురస్కారాలు అందిస్తున్నట్లు ఎంపిడిఒ పి.మల్లీశ్వరి సోమవారం తెలిపారు. ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని ఆమె తెలిపారు. వాలంటీర్లకు సేవారత్న, సేవామిత్ర, సేవావజ్ర పురస్కారాలు అందిస్తున్నామన్నారు.

పదోవ తరగతి టి.సి పోయినది

ఏలూరు జిల్లా, నూజివీడు డివిజన్, ముసునూరు మండలం, ముసునూరు గ్రామానికి చెందిన చింతా వెంకటేశ్వరరావు (లేటు), చింతా నాగమణీల కుమార్డు చింతా రాఘవేంద్ర తమ పదోవ తరగతి బదిలీ సర్టిఫికెట్ ముసునూరులో తమ ఇంటి వద్ద నుండి పోలీస్ స్టేషన్ సెంటర్‌కు జిరాక్స్ నిమిత్తం తీసుకువెళ్లి వచ్చే సమయంలో సిరియల్ నెంబర్ 1602133, ఎల్‌డిఐఎస్ నెంబర్ 943-బి2-2013 తేది 12-08-2013 గల టి.సి సర్టిఫికెట్ పోయినది. కావున ఎవరికైనా దోరికిన ఎడల ఈ క్రింద అడ్రస్‌కు తెలియచేయగలరు.
ముసునూరు, ది.23-05-2023.

చింతా నాగమణీ
చింతా రాఘవేంద్ర
సెల్: 99510 42548